కవితా కౌముది

# కాలం మారిపోయింది బ్రదర్..!

గోమతి(సుమచంద్ర)





గజిబిజి గందరగోళం
గమనింపు లేని కాలం
వేలం వేయబడుతున్న బతుకులు
వేలం వెర్రిగా తీస్తున్న పరుగులు ..!
ఉరికే లోకం...
ఊరక వాగే జాగిలాల సంత
జన జీవితం ఓ అతుకుల బొంత
అందమైన అబద్ధాల అద్దాల చెంత...
మనిషి మోస్తున్న ఆనందం ఎంత??
నిజాలకోసం నిగిడి చూస్తున్నా...
మెడ సాగింది...
ఆకాశం అంచును తాకింది...
కానీ నిజం కానరావడం లేదు...
కానలలో దొరుకుతుందేమోనని...
తొంగి చూసా...
ఎక్కడా జాడ లేదు!
అలికిడి లేని అందమైన జీవితాల్లో...
అలల సునామీలు
కలలు కనే కన్నుల్లో...
ఆగని జలపాతాలు!
ప్లాస్టిక్ నవ్వులు...
గాసిప్ గువ్వలు...
గొలుసు వేసి లాగుతున్నా లొంగని మద గజాలు
మౌనంలో కూరుకు పోయిన మంచితనాలు !
'కాలం మారిపోయింది బ్రదర్' అన్నమాట...
ఆయువు పోసుకుంటూనే ఉంది...
చిరంజీవిగా మారి చెలరేగిపోతూనే ఉంది..!!

★★★

## ఒంటరి వృద్ధుడు

### భమిడిపాటి వెంకటేశ్వరరావు

కనబడని కన్నీళ్లతో
తడిసిపోయిన ఒంటరి పుస్తకం..

ఏదో ఆలోచనల పుటల మధ్య
చిక్కుకున్న సన్నని పంక్తి

అయినవారి అందరితో లింకు తెగి
తన గాయానికి తానే కట్టుగా మారిన గరుకు వస్త్రం

మనవడో మనవరాలో సగం సగం కొరికి
వదిలేసిన రొట్టెముక్క

నిర్దాక్షిణ్యంగా నరికివేయబడి
ఎవరూ పట్టించుకోని
మహావృక్షపు కాండం..

★★★

## ఊహల ఊడలు

### శ్రీ సాహితి

నీ మాటొకటి పడి మొలిచి
నా బ్రతుకులో పెద్ద
వృక్షమయ్యావు.

నీ తలపు వీచిప్పుడల్లా
ఊగే ప్రతి ఊహ
ఊడలు బారి

ఆ నీడలో నీవెక్కడున్నా
చల్లగా రోజా
కాసేపు గడుపుతాను.

సేద తీరే ప్రతి సంగతిని
తృప్తిగా మనసారా
గుండెలో దాచుకుంటాను..

★★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

నాకె యర్థము కానిది నాదు పాట
ఎచటనుండి యే పదలతలిట్లు వచ్చి
పాటగా రూపు చెంద నా పంచ జేరె?
అమరగల్గునె మాలగానలరులన్ని?

ఏ పదమ్ములు వచ్చినవెచటినుండి?
ఎటుల గుమిగూడెనివియన్ని యెడద యందు?
భావమల్పమై ప్రేమ స్తబ్ధతను చెంద
శూన్యగృహమున పనియేమి సూనతతికి?

పదములెగురుచున్నవి ద్విరేఫములవోలె
క్రమముగా నిల్చునంతలో కదలిపోవు
నిలువనేరవు మానసతలముపైన
ఎటుల పాడెద భావరాహిత్యసీమ?

ఆత్మలో మారుమ్రోగు ప్రేమార్ద్రగీతి
భాషకందగరాని భావప్రదీప్తి
మానసమును దాటని యద్భుతానుభవము
పదములేలనో యేలనో వాక్యములును

పలుకకనె నాదు హృదయమ్ము తెలియు నీకు
స్వరరహితగీతి తాకు నీ శ్రవణములను
పదరహితకవితలు జాలువారునిట్లు
ఎగయునుద్వేగముననెద గగనమునకు

COMMENTS